## క్లుప్తంగా

### గణపతి నవరాత్రుల తేదీలు ఖరారు

**నకిరేకల్ :** గణపతి నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 27 నుంచి ప్రారంభించి వచ్చేనెల 5 నిమజ్జనం చేయాలని శ్రీ గాయత్రి వైదిక బ్రాహ్మణ పరిషత్ నకిరేకల్ నియోజకవర్గ కమిటీ ప్రకటించింది. ఆదివారం కమిటీ ప్రతినిధులు సమావేశమై గణపతి ప్రతిష్ఠ, నిమజ్జన తేదీలను ఖరారుచేశారు. వచ్చే నెల 7న చంద్ర గ్రహణం ఉన్నందున 5వ తేదీలోగా నిమజ్జన చేయాలని సూచించారు. ఈ సమావేశంలో వైదిక పరిషత్ నియోజకవర్గ అధ్యక్షుడు పగడిమర్రి వెంకటేశ్వరశర్మ, ప్రతినిధులు మధుసూదన్ శర్మ, మురళీధర్‌శర్మ, రామలింగయ్యశర్మ, నాగఫణి శర్మ, ఆనంద్‌శర్మ, శ్రీనివాస్, గౌతమ్, చంద్రమౌళి భరద్వాజ, సోమ శేఖర్ పాల్గొన్నారు.

### 26న మట్టి విగ్రహాల పంపిణీ

**చండూరు :** మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లేష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మట్టి విగ్రహాల ప్రాముఖ్యత, అవసరాన్ని ప్రజలు గుర్తించాలని, కాలుష్యాన్ని తగ్గించడంలో ప్రజల పాత్ర కీలకమన్నారు. వెయ్యి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక

**చిట్యాల:** మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో మాల కులస్తులు ఆదివారం నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. పెద్దమాలగా మర్రి రాములు, ఉప మాలగా రొయ్య వెంకటేశం, డాక్టర్ బీఆర్.అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా మర్రి సురేష్, ఉపాధ్యక్షుడిగా మందుగుల పెద్ద వెంకన్న, ముత్యాలమ్మ ఆలయ చైర్మన్‌గా మందుగుల రామారావు, వైస్ చైర్మన్‌గా రొయ్య రాకేష్, కార్యదర్శిగా మర్రి రాము, సలహాదారులుగా బుంగ రమేష్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కుల పెద్ద మర్రి ముసలయ్య, మాజీ సర్పంచ్ మర్రి వెంకటరమణ, యాదగిరి, రమేష్, రాంబాబు, భద్రయ్య, యాదయ్య, నర్సింహ, శంకర్, రామచంద్రం, కిరణ్, జానీ, అజయ్, వెంకన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.


### దరఖాస్తుల ఆహ్వానం

**మునుగోడు:** కుటుంబ పెద్దను కోల్పోయి మహిళపై ఆధారపడి జీవించే కుటుంబం జాతీయ కుటుంబ ప్రయోజనం పథకం ద్వారా సహాయం పొందేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.నరేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారి కుటుంబ పెద్ద 12.04.2017 తరువాత మరణించి, మరణ ధృవీకరణ పత్రం పొంది ఉండాలి. ఆ కుటుంబానికి సంవత్సర ఆదాయం రూ.60 వేలకు మించి ఉండకూడదు. ఈ అర్హత కలిగిన వారు దరఖాస్తు ఫారంతోపాటు బ్యాంక్ ఖాతా, ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌లు జతచేసి కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

### నేడు సత్యాగ్రహ దీక్ష

**నల్లగొండ టౌన్:** బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం జరుగనున్న బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

### ఆర్జాలబావి వాసికి డాక్టరేట్


నరేష్

**నల్లగొండ టూటౌన్ :** మున్సిపాలిటీ పరిధిలోని ఆర్జాలబావి ఇందిరమ్మ కాలనీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ అదేపు నరేష్ వరంగల్ ఎన్ఐటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. అదేపు నరేష్.. ప్రొఫెసర్ గుడిపాటి వెంకటేష్, ప్రొఫెసర్ బి.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో మైల్డ్ స్టీల్ సబ్‌స్ట్రేట్స్‌పై పరిశోధన పూర్తి చేసినందుకు గాను డాక్టరేట్ కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ పి.వంశీకృష్ణ చేతుల మీదుగా శనివారం డాక్టరేట్ అందుకున్నాడు. నరేష్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నంలో గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానిక్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు.

### తాటికల్ వాసికి ..


డాక్టరేట్ అందుకుంటున్న రామకృష్ణ

**నకిరేకల్ :** మండలంలోని తాటికల్ గ్రామానికి చెందిన చనగాని రామకృష్ణ వైకల్యం అనేది శరీరానికే కాని మేధస్సుకు కాదని చాటారు. పోలియోతో చిన్నతనంలో ఓ కాలు చచ్చుబడినా పట్టు వదలకుండా పీహెచ్‌డీ పూర్తి చేసి ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ వి.నారాయణ, ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కుమార్ చేతులమీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు. తాటికల్ గ్రామానికి చెందిన చనగాని భిక్షం-జయమ్మ దంపతులు కుమారుడు రామకృష్ణ. ఓయూ హిస్టరీ ప్రొఫెసర్ ఎస్.అంజయ్య పర్యవేక్షణలో ఆన్ ఇన్విస్టిగేషన్ ఇన్ టూది లైఫ్ అండ్ స్ట్రగుల్స్ ఆఫ్ ధర్మభిక్షంగౌడ్ (1911-2011 అనే అంశంపై రామకృష్ణ పరిశోధన పూర్తి చేశారు.

# ఇసుక మేటలే మిగిలాయి..!

- వర్షాలకు కోతకు గురైన పంట భూములు
- భారీగా నష్టపోయిన రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

**శాలిగౌరారం:** ఇటీవల వరుసగా కురిసిన వర్షాలు శాలిగౌరారం మండలంలోని రైతులకు మేలు చేయడంతోపాటూ నష్టం కూడా చేశాయి. భారీ వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాల్లోని వ్యవసాయ పంట భూములు వరద నీటిలో మునిగిపోయాయి. అదేవిధంగా వరి, పంట భూములు వరద నీటి ప్రవాహాలకు కోతకు గురికావడంతో రైతులు నష్టపోయారు. భారీ వర్షాల వల్ల శాలిగౌరారం మండలంలో గండ్లు పడని పంట పొలం లేదు. ఈ నెల 7న రాత్రి కురిసిన అతి భారీ వర్షం రైతులను అతలాకుతలం చేసింది. దాదాపు 14.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది.

**పంట పొలాల్లో ఇసుక మేటలు**

శాలిగౌరారం మండలంలోని పలు గ్రామాలు, మండల కేంద్రంలోని బస్టాప్ వద్ద గల లోతట్టు ప్రాంతంలో వరదనీటి ప్రభావం అత్యధికంగా ఉండడంతో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైతులు ఇటీవలే వరినాట్లు వేయడంతో వరదల ప్రభావానికి వరి పంట పొలాలు దెబ్బతిన్నాయి. వరద ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతంలో కనీసం పంటను సాగు చేసుకునే వీల్లేకుండా పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. వరద నీటితో కోతకు గురైన ప్రాంతాల్లో ఇసుక మేటలు తొలగించలేకపోవడం, తిరిగి నాటు వేసేందుకు వరి నార్లు లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో పంటను వదులుకోక తప్పడం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పత్తి పంటలను కూడా వర్షాలు దెబ్బతీశాయి. ఏటవాలుగా ఉన్న మెట్ట భూముల్లో వరద నీటి ప్రవాహాల వల్ల పత్తి మొక్కలు కొట్టుకుపోయాయి. అదేవిధంగా లోతట్టు భూముల్లో రెండు వారాలపాటు వరద నీరు నిలిచిపోవడంతో పత్తిచేలు జాలుపట్టి ఎర్రగా మారాయి.



శాలిగౌరారంలోని ఓ రైతు వరి పొలంలో వేసిన ఇసుక మేటలు


వరిపొలంలో మేటలు వేసిన ఇసుకను తొలగిస్తున్న రైతు

**44, 500 ఎకరాల్లో పంటల సాగు**

శాలిగౌరారం మండలంలో మొత్తం 44,500 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉంది. అందులో ఈ సంవత్సరం 23 వేల ఎకరాల్లో పత్తి సాగు, 20 వేల ఎకరాల్లో వరి, 1500 ఎకరాల్లో ఇతర పంటల సాగు జరుగుతున్నట్లు వ్యవసాయ అధికారుల నివేదికలు తెలుపుతున్నాయి.


**పొలం మొత్తం కొట్టుకుపోయింది**



శాలిగౌరారం బస్టాప్ వద్ద నాకు పది గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిలో ఇటీవలే బీపీటీ వరినాటు వేశాను. ఈ నెల 7న రాత్రి కురిసిన భారీ వర్షానికి కాల్వ కట్ట తెగి పొలం మీదుగా వరద ప్రవహించడంతో పొలంలోని వరినాటు మొత్తం కొట్టుకుపోయి రాళ్లు, ఇసుక మేటలు వేశాయి. ప్రభుత్వం ఆదుకుని న్యాయం చేయాలి.

– కర్నె చంద్రయ్య, రైతు, తిరుమలరాయునిగూడెం

**నివేదిక అందజేశాం**



ఇటీవల రెండు వారాలపాటు వర్షాలు కురవడంతో మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో వరి, పత్తి పంటలకు కొంత నష్టం వాటిల్లింది. నష్టపోయిన రైతులు పంట నష్టం గురించి మా దృష్టికి తీసుకువచ్చారు. 150 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం.

– సౌమ్యశృతి, మండల వ్యవసాయ అధికారి, శాలిగౌరారం

## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**కట్టంగూర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో కోటి ఇరవై లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న భోజనశాల, వంట గదుల నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, నాయకులు పెద్ది సుక్కయ్య, రెడ్డిపల్లి సాగర్, బెజవాడ సైదులు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

## ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి


తిప్పర్తి : మాట్లాడుతున్న ఎస్ఐ శంకర్

**తిప్పర్తి :** గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని తిప్పర్తి ఎస్ఐ శంకర్ కోరారు. ఆదివారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేశ్ విగ్రహం ఏర్పాటు చేసేవారందరూ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పీస్ కమిటీ సభ్యులు, ఏఎస్ఐ లింగయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**శాలిగౌరారం:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని శాలిగౌరారం పోలీసులు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, శాంతి కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అలుగుపోస్తున్న శాలిగౌరారం ప్రాజెక్టు


శాలిగౌరారం ప్రాజెక్టు ఎడమ అలుగు పోస్తున్న దృశ్యం

**శాలిగౌరారం:** ఉమ్మడి జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి వారం రోజులుగా అలుగుపోస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మూసీ నది నుంచి ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా పెరిగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులు. శాలిగౌరారం ప్రాజెక్టు 1200 ఎకరాల విస్తీర్ణంలో 21 అడుగుల నీటి నిల్వ సామర్థ్యంతో 6వేల ఎకరాల ఆయకట్టు కలిగి ఉంది. ఇప్పటికే ప్రాజెక్టు నుంచి వానాకాలం పంటకు సాగు నీరు అందుతోంది. ప్రాజెక్టు పరిధిలో మండలంలోని శాలిగౌరారం, తిరుమల రాయునిగూడెం, రామగిరి, శాలిలింగోటం, అంబారిపేట, గురుజాల, అడ్లూరు, ఊట్కూరు, బండమీదిగూడెం గ్రామాల్లోని 6 వేల ఎకరాల్లో సుమారు 5 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుని అలుగుపోయడం ప్రారంభం కావడంతో వానాకాలం పంటతోపాటూ యాసంగి పంటకు కూడా ఆయకట్టుకు సరిపడా సాగునీరు అందనుందని ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## వైభవంగా కంఠమహేశ్వర స్వామి బోనాలు


చండూరు : బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

**మునుగోడు:** మండలంలోని సోలిపురం గ్రామంలో గౌడ కులస్తులు ఆదివారం కంఠమహేశ్వరస్వామి బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో వండిన నైవేద్యాన్ని అందంగా అలంకరించిన బోనం కుండలో పెట్టుకుని డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా గ్రామ శివారులోని ఆలయం వద్దకు వెళ్లి స్వామివారికి సమర్పించారు. ఈ వేడుకల్లో గౌడ సంఘం పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**వైభవంగా కాటమయ్య బోనాల వేడుకలు**

**చిట్యాల:** మండలంలోని తాళ్లవెల్లెంల గ్రామంలో ఆదివారం గౌడ కులస్తులు కాటమయ్య బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. పసుపుకుంకుమ, వేపమండలతో అలంకరించిన బోనాలతో గ్రామ శివారులోని శ్రీ కంఠమహేశ్వర సురమాంబ దేవికి మొక్కులు మొక్కుకుని బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జనగాం నర్సింహగౌడ్, మాజీ సర్పంచ్ జనగాం రవీందర్ గౌడ్, జనగాం శేఖర్‌గౌడ్, జనగాం జానార్దన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**చండూరు మండలంలో..**

**చండూరు :** మండల పరిధిలోని పుల్లెంల గ్రామంలో కాటమయ్య బోనాల వేడుకలను గౌడ కులస్తులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు నైవేద్యం వండుకుని బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.


### రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**కనగల్:** మండలంలోని బొమ్మేపల్లి గ్రామ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. కనగల్ ఎస్ఐ కె.రాజీవ్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పెట్రోలింగ్‌లో భాగంగా ఆదివారం ఉదయం కానిస్టేబుల్ నరేష్, హోంగార్డు బాలరాజు బొమ్మేపెల్లి గ్రామ వాగు వద్దకు వెళ్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను ఆపే ప్రయత్నం చేయగా ట్రాక్టర్లను వదిలి డ్రైవర్లు పరారయ్యారు. ఆ ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి డ్రైవర్లు తాటికొండ యాదయ్య, తాటికొండ నాగరాజుపై కేసు నమోదు చేసామని ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఎవరైనా ఇసుక తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు పాటించి అనుమతి ఉన్నచోటనే ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు.

### హామీలు అమలు చేయాలి

**కేతేపల్లి:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల ఫోరం నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్ ఎస్‌కే.యూసుఫ్అలీ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి ఐడెంటిటీ కార్డులు ఇవ్వడంతోపాటు 250 గజాల స్థలం కేటాయించాలన్నారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రతి నెలా రూ.25వేల పింఛన్ ఇవ్వాలన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయూత


నకిరేకల్ : సరుకులు అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు


శాలిగౌరారం: నివాళులర్పిస్తున్న స్నేహితులు

**నకిరేకల్ :** మెదక్ జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన పెరుక సతీష్‌కుమార్ (35) అనే వ్యక్తి కి రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. వైద్యం కోసం డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న నకిరేకల్‌లోని లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు అతడికి చేయూతనిచ్చారు. ఆదివారం అక్కడికి వెళ్లి 75 కేజీల బియ్యం, మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ. 2 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కర్నాటి నరేష్, బ్రహ్మదేవర నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**శాలిగౌరారం:** ఇటీవల రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన మండల కేంద్రానికి చెందిన కబడ్డీ క్రీడాకారుడు బండారు మహేశ్ కుటుంబానికి ఆదివారం శాలిగౌరారం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన 2002-03 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రూ.1.30 లక్షలు, ఉపాధ్యాయులు రూ.32 వేలు, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. మహేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

### వీల్ చైర్ల పంపిణీ


వీల్‌చైర్లతో వృద్ధులు


**కనగల్:** మండలంలోని కురంపల్లి గ్రామంలో ఆదివారం పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10 మంది వృద్ధులకు వీల్ చైర్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ రెబ్బవరపు జెస్సిపాల్, దొడ్డి సరోజ, స్టేట్ కోఆర్డినేటర్ సల్మాన్, జిల్లా కోఆర్డినేటర్ జిల్లా శ్యాంసన్ పాల్గొన్నారు.

### బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

**నల్లగొండ టౌన్:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా ఇవ్వాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ ఈ నెల 25న హైదరాబాద్‌లో ఆర్. కృష్ణయ్య చేపట్టనున్న సత్యాగ్రహ దీక్షకు అధిక సంఖ్యలో బీసీలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో కొంపల్లి రామన్నగౌడ్, మధు, దన్నంపల్లి హరీష్, కాడ శివ, కీసర నరేష్, మొగిలిచర్ల నిరంజన్ పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ

**కనగల్:** హైదరాబాద్‌లో ఈ నెల 25న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న సత్యాగ్రహ దీక్షకు బీసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగం లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని బోయినపల్లి గ్రామంలో సత్యాగ్రహ దీక్ష పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జెట్టి భిక్షం, జెట్టి మారయ్య, రుద్రాక్షి నగేష్, భీమనగోని శంకరయ్య, మహేష్, కిరణ్, రామలింగం, మురళి, నరసింహ, ప్రసాద్, లక్ష్మణ్, శంకర్, రవి పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

## లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

**నకిరేకల్ :** నకిరేకల్ లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ రేపాల మదన్‌మోహన్ అన్నారు. నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో ప్రముఖ వైద్యుడు డాక్టర్ యానాల మోహన్‌రెడ్డి సతీమణి శాంతమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం నకిరేకల్ లయన్స్ క్లబ్, సెంటినియల్, నవ్య క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా క్లబ్‌ల అధ్యక్షులు రేపాల సతీష్, కందాల ప్రేమ్‌నాథ్‌రెడ్డి, ఎన్.రమాదేవి, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మదన్‌మోహన్

- రోడ్డంతా బురదమయం



**నాంపల్లి :** మండల కేంద్రంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. గతంలో మిషన్ భగీరథ పైపు లైన్ల కోసం రోడ్లు తవ్వడంతో గుంతలమయంగా మారాయి. దీనికి తోడు సీసీ రోడ్లు వేసేటప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో కొద్దికాలానికే గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


## యోగా చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక

**చిట్యాల:** జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి యోగాసన్ స్పోర్ట్స్-2025 చాంపియన్ షిప్‌లో చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలోని సౌమ్య విద్యామందిర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. పాలిమేర అజయ్‌కుమార్, రొండి సాయి జశ్వంత్ అండర్-10 విభాగంలో జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల డైరెక్టర్ బొడిగె రవీందర్ గౌడ్, ప్రిన్సిపాల్ బొడిగె విజయకుమార్‌గౌడ్, పీఈటీ రుద్రారపు మల్లేష్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమోంటోలను జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నంద్యాల రాజశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి నిరసనమెట్ల నాగార్జున అందజేశారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థి

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

- మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ పాడిటి చంద్రయ్య


షూ, బెల్ట్, టై అందజేస్తున్న మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య

**శాలిగౌరారం:** ప్రతి విద్యార్థి విద్యలో రాణించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్, శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన పాడిటి చంద్రయ్య అన్నారు. ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన ఉద్యోగుల గ్రూపు ఆధ్వర్యంలో గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రూ.1.50 లక్షల విలువైన షూ, టై, బెల్ట్, గుర్తింపు కార్డులతో పాటు పాఠశాలకు మైకెసెట్, ఉపన్యాస పోడియంను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల అలవర్చుకోవాలని అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారన్నారు. డీఆర్‌డీఓ సీనియర్ శాస్త్రవేత్త రామస్వామి యాదగిరి మాట్లాడుతూ.. భవిష్యత్తులో దేశ రక్షణలో విద్యార్థులు, యువత పాలుపంచుకోవాలన్నారు. పాఠశాల నుంచి ఎస్సెస్సీలో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం ప్రోత్సాహకాలు అందజేస్తామని ఉద్యోగుల గ్రూపు ప్రతినిధులు ప్రకటించారు. గతంలో పాఠశాలకు రూ.1.30 లక్షలతో డెస్క్ బెంచీలు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఉద్యోగుల గ్రూపు సభ్యులను అభినందించారు. ఎంఈఓ సైదులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామాచారి, చంద్రారెడ్డి, ఉద్యోగుల గ్రూపు సభ్యులు నగేశ్, మల్లికార్జున్, చక్రపాణి, భిక్షం, భాస్కర్, శ్రీనివాస్, అవనిజ, శ్రీను, కృష్ణమూర్తి, నారాయణ, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, జగత్, వీరయ్య, పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సర్వే


వీధులను పరిశీలిస్తున్న నాయకులు

**చిట్యాల:** వెలిమినేడు గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని చిట్యాల మండల సీపీఎం నాయకులు అర్రూరి శ్రీను, నెల్లికంటి నర్సింహ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన సర్వే కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లలోని మురికి నీరు పంట పొలాల్లోకి వదలడం వల్ల వరి పంటలు దెబ్బతింటున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు పంది నరేష్, గ్రామ కార్యదర్శులు నాతి వెంకట్రామయ్య, సుర్కంటి మోహన్‌రెడ్డి, అర్రూరి శంభయ్య, దుర్గయ్య, స్వామి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున సాగర్‌లోని బుద్ధవనాన్ని జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆదివారం తన బంధువులతో కలిసి సందర్శించారు. బుద్ధవనంలోని మ్యూజియంలో వస్తువులను తిలకించారు.

